ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

బుధవారం 22 అక్టోబరు 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 24.0



తెలంగాణ రైజింగ్ 2047
సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25నాటికి సర్వే ముగుస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పన కోసం ఉద్దేశించిన సిటిజన్ సర్వేలో తెలంగాణ ప్రాంత పౌరులు మాత్రమే పాల్గొని తమ విలువైన సందేశాన్ని అందజేయాలని కోరారు.

సిరుల బంతి

- తక్కువ పెట్టుబడితో అధిక లాభం
- సమయం, నీరు ఆదా..
- కిలో బంతి పూల ధర 120 రూపాయలు

6



సాతాపూర్ గ్రామ శివారులో బంతితోట సాగు చేసిన రైతు బాయికాడి పరమేశ్

కురుమూర్తి రాయుడికి కోటి దండాలు

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 26న అలంకారోత్సవం, 28న ఉద్దాలోత్సవం
- ఏర్పాట్లపై నేడు సమీక్షా సమావేశం

7

కార్తీక మాసం పరమ పవిత్రం


- నేటి నుంచి ప్రారంభం
- ముస్తాబైన ప్రధాన ఆలయాలు
- నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు



కొనసాగాలంటే.. చదవాల్సిందే!

ఐదేళ్లుపైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెట్ పాస్‌కావాల్సిందే

- రెండేళ్ల వ్యవధిలో పాస్ కాకుంటే ఇంటికే..
- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాల్సిందేనన్న ఎన్‌సీటీఈ
- ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు ఉద్యోగోన్నతి పొందాలంటే వారికీ వర్తింపు
- ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లకంటే పైబడి సర్వీసు టీచర్లు 3,422 మంది
- చేసేది లేక పుస్తకాలతో కుస్తీ





వనపర్తి జిల్లాలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మహబూబ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు కొత్త ఆందోళన వచ్చి పడింది. గతంలో టెట్ రాయకుండా టీచర్లుగా ఎంపికైన వారు ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉంటే కచ్చితంగా టెట్ రాయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ ఉత్తర్వులపై ఉపాధ్యాయులు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యూకేషన్ (ఎన్‌సీటీఈ)కి విన్నవించారు. అందుకు ఎన్‌సీటీఈ స్పందిస్తూ, టీచర్లు కచ్చితంగా సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాల్సిందేనని మంగళవారం బదులివ్వడంతో ఉపాధ్యాయుల ఆఖరి ఆశలు కూడా గల్లంతయ్యాయి. దీంతో వృత్తిలో కొనసాగాలంటే చదవాల్సిందే నని పుస్తకాలు కొని తెచ్చుకుని మరీ కుస్తీ పడుతున్నారు.

ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిలో ఆందోళన

ప్రభుత్వం రెండేళ్ల కాలవ్యవధిలో నాలుగుసార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహిస్తోంది. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించగా.. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానాన్ని అనుసరిస్తోంది. ఆఫ్‌లైన్ విధానంలో వేరే వారిని పెట్టి పరీక్ష రాయిస్తున్నారనే ఆరోపణలతో ఆన్‌లైన్ చేశారు. ఆరు నెలలకు ఒక టెట్ చొప్పున నాలుగు టెట్‌లలో ఏదో ఒకదానిలో క్వాలిఫై కావాల్సి ఉంది. ఇది విద్యార్థుల పనితీరు మెరుగుదల, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని సుప్రీం కోర్టు తన తీర్పులో వెల్లడించగా.. ఎన్‌సీటీఈ కూడా సమర్థిస్తోంది. ఒకవేళ రెండేళ్లలో టెట్ క్వాలిఫై కానిపక్షంలో ఆ ఉపాధ్యాయులు సర్వీసులో కొనసాగే అవకాశం లేదు. ఉద్యోగ విరమణ లేదా టర్మినల్

(మిగతా 6లో..)

ఐదేళ్ల సర్వీసు ఉన్న వారు 3,422 మంది

ఉమ్మడి జిల్లాలో టెట్ రాయకుండా టీచర్లుగా ఎంపికైన వారు 6,392 మంది ఉన్నారు. అందులో 2,970 మంది ఐదేళ్ల కంటే సర్వీసు తక్కువ ఉన్నవారు ఉండగా, మిగతా 3,422 మంది ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్న వారు ఉన్నారు. ఈ 3,422 మంది కచ్చితంగా టెట్ పాస్ కావాల్సి ఉంది. లేకపోతే కంపల్సరీ రిటైర్‌మెంట్ తీసుకోవాలి. లేదంటే టర్మినల్ బెనిఫిట్స్ తీసుకుని ఇంటికి వెళ్లాలి. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉపాధ్యాయ సంఘాలు ఒత్తిడి తెస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశాయి. తాజాగా ఎన్‌సీటీఈ కూడా ఈ డిమాండ్లపై ఏకీభవించకపోవడం గమనార్హం.

సహకారం.. ఎప్పుడు?

కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం ఎదురుచూపులు

- ఉమ్మడి జిల్లాలో పదింటికి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- కొత్త జిల్లాలు అయ్యాక ఏర్పాటు కాని సంఘాలు
- ప్రస్తుతం ఉన్నవి 78 సంఘాలు.. 5,33,309 మంది సభ్యులు
- రూ.509.32 కోట్ల రుణాల అందజేత





మహబూబ్‌నగర్‌లోని ఉమ్మడి జిల్లా డీసీసీబీ కార్యాలయం

పాలమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల ఏర్పాటుకు అధికారులు రూపొందించిన ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వానికి పట్టింపు కరువైంది. కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటి నుంచి పీఏసీఎస్‌ల విస్తరణ చేపట్ట లేదు. ఇటీవల అధిక సంఖ్యలో కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. వాటికి అనుగుణంగా కొత్త పీఏసీఎస్‌ల పరిధి పెంచకపోవటంతో ఆయా మండలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాలతో పాటు కొన్ని చోట్ల గ్రామం పెద్దగా ఉంటే అక్కడే పీఏసీఎస్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

29,649 మంది రైతులకు రుణాలు

ఉమ్మడి జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ఫిబ్రవరి-2025లో డీసీసీబీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా

(మిగతా 6లో..)

కొత్త పీఏసీఎస్‌లకు ప్రతిపాదనలు ఇలా..

నారాయణపేట జిల్లాలో కృష్ణ, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డిలో, మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌కొండలో, రంగారెడ్డి జిల్లాలో చౌదరిగూడ, కేశంపేటలో, వికారాబాద్ జిల్లాలో గోకస్లావాద్, రుద్రారం, దుద్యాల్‌లో పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 78 కొనసాగుతుండగా.. కొత్తగా ఏర్పడబోయే మరో 10 కలుపుకుని మొత్తం 88 పీఏసీఎస్‌లు ఏర్పడనున్నాయి. కొత్త వాటితో కొత్త సభ్యులకు అవకాశం కలుగనుంది.

కాంగ్రెస్ గుండెల్లో గుబులు

- బాకీ కార్డు ప్రజల బ్రహ్మాస్త్రం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ప్రజలకు చూయిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు బాకీ కార్డుతో ప్రచారం చేస్తుంటే కాంగ్రెస్ గుండెల్లో గుబులు పుడుతోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని నాగవరంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీ పడిన రూపాయలను గుర్తుచేసే బాకీ కార్డులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసమర్థపాలను కప్పిపుచ్చుకోవడానికి నిత్యం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుందని అన్నారు. వ్యక్తిగత దూషణలతో ప్రజాభిమానాన్ని పొందలేరని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేక రోజుకో డ్రామా ఆడుతున్నారని దుయ్యబట్టారు. బకాయి పడ్డ హామీలు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, నందిమల్ల, అశోక్, గులాం ఖాదర్ ఖాన్, ఉంగ్లం, తిరుమల్ జోహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అమరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ బీఎం సంతోష్
- రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- త్యాగాలే స్ఫూర్తి : ఎస్పీ

గద్వాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణ, శాంతిభద్రతల కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణదినం (పోలీస్ ఫ్లాగ్ డే)కు ముఖ్యఅతిథిగా కలెక్టర్ బీఎం సంతోష్ హాజరయ్యారు. పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. అలాగే ఎస్పీ శ్రీనివాసరావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగులయ్య, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పోలీసు అమరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. అనంతరం గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 191 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు ఎస్పీ శంకర్ చదివి వినిపించారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. ప్రజారక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకొంటూ ప్రతీ ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబంతో కలిసి జరుపుకోవాల్సిన పండుగలు వదులుకుంటారని, అలాంటి వారికి అండగా నిలబడిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు : ఎమ్మెల్యే

పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాళి అర్పించిన అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసువీరులను సమాజం గుర్తుంచుకుంటుందని అన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణ యూనిట్, భరోసా, షీటీం, సైబర్ క్రైం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ట్రాఫిక్, ఆయుధ ప్రదర్శన, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగులయ్య, సాయుధ దళ, డీఎస్పీ నరేందర్ రావు, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, సీఐలు, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ రాకేశ్ కేసులో మరో వ్యక్తి రిమాండ్

- వెల్లడించిన వనపర్తి సీఐ కృష్ణ

7

హెచ్‌సీఏ 2డే లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ గెలుపు

- 8 వికెట్ల తేడాతో నిజాం కాలేజీపై విజయం

భక్తిశ్రద్ధలతో వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కేటీదొడ్డి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం సమీపంలో వెలసిన పాగుంట వెంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిపించారు. వేకువజామునే స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్వామి వారికి సమర్పించిన పట్టు వస్త్రాలను ధరించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సమక్షంలో ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవారి కళ్యాణాన్ని జరిపించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు వేదపండితులు పూర్ణ కుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగక కుండా అన్ని వసతులను కల్పించాలని సూచించారు. అనంరతం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి పురంధర్ కుమార్, నాయకులు, శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్, రామకృష్ణనాయుడు, ఉరుకుందు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా దీపావళి

- భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు
- పల్లె, పట్టణాల్లో టపాసుల మోత



గద్వాలలో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

గద్వాల అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు దీపావళి పండుగను సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు భక్తిశ్ర ద్ధలతో జరుపుకున్నారు. ఆశ్వయిజ బహుళ చతుర్థశిని నరక చతుర్థశిగా జరుపుకున్న ప్రజలు, మరుసటి రోజు మంగళవారం అమావాస్య తిథి కలిసి ఉండటంతో దీపాళితో పాటుపెద్దల పండుగగా జరుపుకున్నారు. సోమవారం వారాంతపు సంత కావడంతో అటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు, పట్టణవాసులతో వివిధ అవసరాల కోసం పండుగ సరుకులు కొనేందుకు రావడం తో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఇళ్లలో లక్ష్మీదేవి పూజలు, పలు దుకాణాల్లో రెండురోజుల పాటు ధనలక్ష్మి, సరస్వతీ దేవీ పూజలు సంప్రదాయబద్ధంగా జరుపుకు న్నారు. రాత్రివేళ పట్టణంలోని వీధివీధిలో టపాసులు మోతలు వినిపించాయి. చిన్నారులు, యువతీయువలు పెద్దలు అనే బేధం లేకుండా మతాబులు పేల్చేందుకు ఉత్సాహం చూపారు.

- అయిజ : అయిజలో సోమవారం సాయంత్రం ఇంటి ముంగిట మహిళలు దీపాలు వెలిగించారు. రాత్రి టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు.

● వసతిగృహంలో సంబురాలు

గద్వాల న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం(ఏ)లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం వసతి విద్యార్థులు, సిబ్బంది పండుగను ఘనంగా జరుపుకున్నారు. వార్డెన్ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు.

పిడుగుపడి రైతు మృతి

రాజోలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలంలో పత్తి తీసేందుకు వెళ్లిన రైతు పిడుగు పడి మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముండ్లదిన్నె గ్రామానికి చెందిన కుర్వ మద్దిలేటి (42) అనే రైతు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పత్తి తీసేందుకు కూలీలను తీసుకొని ఉదయం వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. కూలీలు పరిశీలించి మద్దిలేటి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. మృతుడికి ఒక కూతురు, ఓ కుమారుడు ఉన్నారు.



మద్దిలేటి (ఫైల్)

ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్, ఫార్మ్-డి, బి.పి.ఎడ్ ఫలితాలు విడుదల

6

పంజాబ్ బయలుదేరిన పీయూ ఆర్చరీ జట్టు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ ఆర్చరీ పురుషుల జట్టు పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ పోటీలో పాల్గొనేందుకు మంగళవారం పురుషుల జట్టు పంజాబ్ బయలుదేరింది. ఈ పోటీలు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1 వరకు జరుగుతాయన్నారు. క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి విజయం అందించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫాం అందజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు, డాక్టర్ కిషోర్, పీయూ పీడీ శ్రీనివాసులు, కోచ్‌లు నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీయూ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌తో ఆర్చరీ జట్టు క్రీడాకారులు

ప్రజా శ్రేయస్సుకు

ప్రాణాలు అర్పించేది పోలీసులే

» కమాండెంట్ ఎం. జయరాజ్

ఎర్రవల్లి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిరంతరం ఉంటూ ప్రజా శ్రేయస్సు కోసం రాత్రి పగలు విధి నిర్వహణలో శత్రువులతో పోరాడే సందర్భాల్లో ప్రజల కోసం ప్రాణాలు అర్పించేది పోలీసులేనని పదవ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎం.జయరాజ్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల పరిధిలోని పదవ పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమాండెంట్ మాట్లాడారు. బెటాలియన్ ఆవరణంలో ఉన్న అమరుల స్మారక స్థూపం దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో అమరులను స్మరించుకుంటూ మాట్లాడారు. ఆర్‌ఐలు, ఏఆర్‌ఐలు, బెటాలియన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పదవ పోలీస్ బెటాలియన్‌లో అమరులకు నివాళ్లు అర్పిస్తున్న కమాండెంట్ సిబ్బంది

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మక్తల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న మక్తల్ పట్టణంలో ఉమ్మడి జిల్లా సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 53మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సైక్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో నవంబరు 3 నుంచి 5వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14, 16, 18ఏళ్ల బాలబాలికలకు 5 , 10 కిలోమీటర్లు, 18ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులకు 10, 20కిలోమీటర్ల పోటీలు నిర్వహించామన్నారు. ఎంపి కైన వారికి సర్టిఫికెట్లు అందించి సన్మానించారు. పీడీలు, పీఈటీలు విష్ణువర్ధన్ రెడ్డి, రేణుక, స్వరూప, మంజుల, త్రివేణి, వెన్నెల, స్వప్న, అనిత, లక్ష్మీ, అనూష, దేవకమ్మ, గాయత్రి, సరోజలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొన్న 300ల మంది క్రీడాకారులకు జనసేన నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మణికంఠగౌడ్ తన స్వంత ఖర్చులతో భోజన వసతి కల్పించారు.



పోటీలకు ఎంపికైన సైక్లింగ్ విద్యార్థులు

పెద్దపులుల ప్రత్యక్షం

» సఫారీ టూర్‌లో తరచూ తారస

» పెద్దపులుల సంచారాన్ని చూస్తూ ఆనందిస్తున్న పర్యాటకులు

మన్ననూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్య ప్రాంతంలో మూడు రోజులుగా పెద్దపులులు సందడి చేస్తున్నారు. పర్హాబాద్ వ్యూపాయింట్‌కు వెళ్లే దారిలో, గుండం సఫారీ రిజర్వు ఫారెస్టులో పెద్దపులుల సంచారం అధికమైంది. పర్హాబాద్ చౌరస్తా నుంచి సఫారీ వాహనాల్లో వెళ్లే పర్యాటకులకు రెండు రోజుల్లో మూడు పర్యాయాలు పెద్దపులులు సంచరిస్తూ కనిపించాయి. ఇట్టి దృశ్యాలను తమ వెంట తెచ్చుకున్న చరవాణీలు, కెమెరాల్లో చిత్రీకరణ చేసుకొని ఆనందంతో పర్యాటకులు పరవశించి పోతున్నారు. అక్టోబరు 1 నుంచి టైగర్ సఫారీ పునఃప్రారంభమైంది. పర్యాటకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో సఫారీ పర్యటనకు వస్తున్నారు. గతంలో ఆరుసార్లు పెద్దపులులు నిజాంబంగ్లా(షికారీగర్), గుండం రహదారిలో సంచరిస్తూ కనిపించి సందడి చేశాయి. తాజాగా మంగళవారం సాయంత్రం అటవీ సిబ్బందికి పుల్లాయపల్లి బీట్‌లో ఓ పెద్దపులి కనిపించినట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి అటవీశాఖకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి ధ్రువీకరించారు. పెద్దపులులు సంచరిస్తూ కనిపించడంతో టైగర్ సఫారీ ఆఫ్‌లైన్ రేట్లను 3వేల ప్యాకేజీని 5వేలకు, 2వేల ప్యాకేజీని 3వేలకు అమాంతంగా పెంచేశారు.



పుల్లాయపల్లి బీట్‌లో కనిపించిన పెద్దపులి

పిచ్చికుక్క స్వైరవిహారం

» నలుగురు చిన్నారులకు గాయాలు

జడ్చర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కాలనీలో ఆడుకుంటున్న నలుగురు చిన్నారులపై దాడి చేసి గాయపరిచింది. వారిలో అఖిల్, మానసలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాధిత చిన్నారులకు జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కావేరమ్మపేటలో కుక్కల బెడద అధికమైందని, అధికారులు స్పందించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



కావేరమ్మపేటలో పిచ్చికుక్క కరవడంతో గాయపడిన చిన్నారి

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

తాడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో మంగళవారం ఎల్‌టీ లైన్‌కు సంబంధించిన విద్యుత్ వైరు తగిలి పాడి గేదె మృతి చెందడం జరిగింది. గ్రామానికి చెందిన చాకలి వెంకటయ్య అనే రైతు గేదెలను మేపుకుంటూ వెళ్తున్న క్రమంలో దుందుబీ నది సమీపంలో ఎల్‌టీ విద్యుత్ లైన్ వైర్లు కిందికి వాలి ఉండడంతో గేదె గడ్డి మేసుకుంటూ వెళ్లి వైర్లకు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.90,000 ఉంటుందని రైతు వెంకటయ్య వాపోయాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

● లాభాల పూతోట

సిరుల బంతి



సాతాపూర్‌లో సాగు చేసిన బంతిపూలు

» తక్కువ పెట్టుబడి, సమయం, నీటి వినియోగం

» వాణిజ్య పంటల కన్నా లాభదాయకం

» కిలో బంతి పూలు రూ.120 పలుకుతున్న ధర

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంతి పూల సాగులో రైతులు అధిక లాభాలు పొందుతున్నాయి. పలువురు రైతులు మాస పద్ధతిలో ఒకే పంట సాగు చేసుకోవడంతో పెద్దగా లాభాలు పొందలేక పోతున్నారు. మెట్ట పంటలైన కూరగాయల సాగుతో పాటు పూల తోటల్లో బంతి సాగు చేస్తున్న రైతులు అతి తక్కువ సమయంలో అధిక లాభాలు పొందుతున్నారు. విత్తనాల ఖర్చు మినహాయింపు ఇస్తే పెట్టుబడి కూడా అంతగా ఉండదు. తక్కువ నీటి వినియోగంతో 70-80రోజుల్లో పూలు కోతకు వస్తాయి. బంతి పూలకు సీజన్‌లో భలే డిమాండ్ పలుకుతుంది. రైతులు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సాగు చేసుకుంటే ఎకరాలో లక్ష రూపాయల ఆదాయం పొందవచ్చు. ముఖ్యంగా సెప్టెంబరు-అక్టోబరు మాసాల్లో ఈ పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో బంతి సాగు చేసే రైతుల సంఖ్య ఏడాదికి ఏడాది పెరుగుతూ వస్తోంది. గతంలో ఒకటి రెండు గ్రామాల్లో బంతి సాగు చేసే వారు ప్రస్తుతం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లితోపాటు సాతాపూర్, దేవుని తిర్మలాపూర్, చెన్నపురాంపల్లి, కల్వకోల్, ఆదిరాల, చంద్రకల్ గ్రామాల్లో కూడా పండిస్తున్నారు. ఒక ఎకరాకు బంతి సాగుకు 30 నుంచి 50వేలు పెట్టుబడి అవుతుందని పంట రోజు విడిచి రోజు సుమారు 2క్వింటాళ్ల దిగుబడి వస్తుందనిరైతులు అంటున్నారు.

ధరలు ఉంటే మంచి లాభాలు



బంతిపూల సాగు ద్వారా మంచి లాభాలను సాధించవచ్చు. కొంత శ్రమ పడితే సాగుపూటగా సాగుతుంది. ముఖ్యంగా బంతిపూలకు తెలంగాణ ప్రాంతంలో మంచి డిమాండ్ ఉండడంతో ఆ వైపు సాగు చేశాం. ఎకరాకు దాదాపు 4 నుంచి 5టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో కిలో బంతిపూలు రూ.100 నుంచి 130వరకు పలుకుతుంది. ఎకరా బంతి సాగు చేస్తే 2లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

- బి.పరమేశ్, రైతు, సాతాపూర్

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

» జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

వెల్దండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వెల్దండ మాజీ ఉపసర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు చిమ్ముల శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. గత పదిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆచారి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పార్టీపరంగా బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కును అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పరమేశ్‌గౌడ్, విష్ణుగౌడ్, దేవేందర్, శ్రీశైలం, రవి, పెద్దయ్య తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఆచారి, బీజేపీ నాయకులు

సహకారం ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటైన మండలాల్లో పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్న సర్కారు నిర్ణయం మేరకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. వికారాబాద్‌లో 3, నారాయణపేటలో 3, గద్వాలలో 1, మహబూబ్‌నగర్‌లో 1, రంగారెడ్డిలో 2 పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 78 పీఏసీఎస్‌లు కొనసాగుతున్నాయి. ఈ సంఘాల్లో 5,33,309 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. అందులో 77,623 మంది రైతులు వివిధ రకాల రుణాలు తీసుకున్నారు.

పీఏసీఎస్ ద్వారా వ్యవసాయ రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29,649 మంది రైతులకు రూ.509 కోట్లా 32 లక్షలా 71 వేల రుణాలు అందించారు.

ఆర్థికంగా బలోపేతమైన పీఏసీఎస్‌లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం నిర్వహిస్తున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం



ఉమ్మడి జిల్లాలో కొత్తగా 10 పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్న సంఘాల ద్వారా రూ.50 పైసలకు వడ్డీపై పంట రుణాలను అందిస్తున్నాం. సంఘాల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం మరువలేనిది. డీసీసీబీ అభివృద్ధికి రైతులు, ప్రజలు ఇలానే సహకరించాలి.

- ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

కొనసాగాలంటే.. చదవాల్సిందే!

(5వ పేజీ తరువాయి)

బెనిఫిట్స్ తీసుకుని ఉద్యోగం నుంచి వైదొలాగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. అయితే నిత్యం పాఠశాలలకు వెళ్లి.. పాఠాలు చెప్పేవారు ఇదే వృత్తిగా ఉన్నవారు సులభంగా క్వాలిఫై అవుతారని, కానీ ఉపాధ్యాయ వృత్తి కాకుండా ఇతర వ్యాపారాలు, ఫైనాన్స్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించే వారు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

పదోన్నతికీ అవసరమే..

ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాల్సి ఉండగా, ఐదేళ్లలోపు ఉన్న వారికి ఆ అవసరం లేదు. అదే సమయంలో మిగిలిన ఐదేళ్లలో ఉద్యోగోన్నతి పొందాలంటే మాత్రం కచ్చితంగా టెట్ కావాల్సిందే. ఈ విషయంపై చాలామంది సీనియర్ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు అనుభవం ముఖ్యమని.. టెట్ వల్ల తమ సీనియారిటీని ప్రశ్నిస్తున్నట్లు ఉందని అంటున్నారు. ఆరోగ్యం, వయసు, చదివే ఓపిక రీత్యా.. ఈ కాలం పిల్లలతోపాటుగా పరీక్షలు రాయాల్సి వస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొందరు ఇప్పటికే తమ పనిని ప్రారంభించగా.. మరికొందరు నేటి నుంచి టెట్ కోసం చదవాల్సి వస్తుందని చెబుతున్నారు. రోజూ చెప్పే పాఠాలే అయినప్పటికీ.. ఇప్పుడు పరీక్షలకు సన్నద్ధం కావడం విచిత్రంగా ఉందని మరికొందరు పెదవి విరిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ విధానం వల్ల టీచర్ల పనితీరు మెరుగుపడుతుందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను సమర్థులుగా తయారు చేసేందుకు ఈ సన్నద్ధత ఉపయోగపడుతుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. నాణ్యమైన బోధనే లక్ష్యంగా తెచ్చిన ఈ విధానాన్ని సమర్థిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు 14,070 పోస్టులు మంజూరు

ఉమ్మడి పాలమూరులోని 5 జిల్లాల్లో కలిపి ఉపాధ్యాయ పోస్టులు 14,070 మంజూరు ఉన్నాయి. ప్రస్తుతం 13,130 మంది పని చేస్తున్నారు. 2010 తర్వాత నుంచి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో టెట్ నిర్వహిస్తున్నారు. అంతకుముందు టెట్ లేకుండా టీచర్‌గా ఎంపికైన వారు జిల్లాలో 6,738 మంది ఉన్నారు. మిగతా 6,392 మంది 2010 తర్వాత వివిధ సందర్భాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసి.. పాసయ్యారు. అయితే ఎన్‌సీటీఈ 2010లో అంతకుముందు ఎంపికైన టీచర్లకు టెట్‌లో మినహాయింపు ఇచ్చింది. కానీ 2017లో వారికీ టెట్ కావాలని పార్లమెంట్‌లో చట్టం చేశారు. దీన్ని ఈ సంవత్సరం తీర్పు సందర్భంగా సుప్రీం సమర్థిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది.

భారీ వర్షం

» వరి పంటకు తీవ్రనష్టం

కోయిలకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో కోతకు వచ్చిన వరి పంటకు తీవ్రనష్టం సంభవిచ్చింది. వరి భూమిమీద పడి పంట పూర్తిగా నీటిలో తేలాడింది. వరి పంటతో పాటు, రోడ్లపై పోసిన ధాన్యం నీటిలో తడిసి పోయింది.



కోయిలకొండలో వర్షానికి తడిసిన వరి

పండుగ పూట విషాదం

» పూజగదిలో మహిళకు నాగుపాము కాటు

» వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలింపు

కొల్లాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ నేపథ్యంలో ఇంట్లోని పూజ గదిలో గల దేవుళ్ల పటాలను తీస్తున్న మహిళకు నాగుపాము కాటు వేసిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. బాధితురాలిని వైద్యం కోసం కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యన్మన్‌బెట్ల గ్రామంలోని దళిత కాలనీలో నివాసం ఉంటున్న దళిత వెంకటమ్మ దీపావళి పండుగ సందర్భంగా తన ఇంటిలోని పూజ గదిలోకి వెళ్లి దేవుని పటాలను శుభ్రం చేసేందుకు తీస్తున్న క్రమంలో పటాల వెనుక దాగి ఉన్న నాగు పాము ఒక్కసారిగా ఆమెకు కాటువేసింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు నాగుపామును వెతికి చంపి వెంట తీసుకొని కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బాధితురాలిని తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదన్న వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్‌లోని జనరల్ ఆసుపత్రికి వెంకటమ్మను తరలించారు.



కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు వెంకటమ్మ

నిరాహార దీక్ష విరమణ

అచ్చంపేట రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు నారమోని నరేష్ అన్యాయంగా ఎలాంటి షోకాజ్ నోటీస్ విచారణ జరపకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని తిరిగి తీసుకునే వరకు పోరాటం చేస్తానని ఆదివారం నిరాహార దీక్ష ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లిలోని దుర్గా మాత ఆలయంలో తలుపులు గొళ్లెం పెట్టి ఆమరణ దీక్ష లో కూర్చొన్నాడు. సోమవారం రాత్రి స్నేహితులు, బంధు వులు ఎవరు చెప్పినా వినకపోవడంతో తాళాలు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి నచ్చజెప్పి అతనితో దీక్షను విమరణ చే యించారు. ఇటీవల దుర్గామాత నవరాత్రులు ప్రారంభం నుంచి జరుగుతున్న పరిణామాలు, వర్గ విబేధాలు మొ త్తం ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే లా చూస్తామని మధ్యవర్తులు హామీ ఇవ్వడంతో నరేష్ దీక్ష విరమించినట్లు తెలిసింది.



ఆమరణ నిరాహార దీక్షలో నారమోని నరేష్

సామూహిక వివాహాలకు

ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

» ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సామూహిక వివాహాలకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అచ్చంపేటటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో వచ్చే నెల 16న మునిసిపల్ కౌన్సిలర్ గోపిశెట్టి శివ ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహాలకు హాజరుకావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆహ్వానించామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మునిసిపల్ కౌన్సిలర్ గోపిశెట్టి శివతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి సామూహిక వివాహ పత్రిక అందజేశారు. అనంతరం ఆయన నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. నవంబరు 16న అచ్చంపేటలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు ముఖ్యమంత్రితో పాటు పెద్ద ఎత్తున రాజకీయ ప్రముఖులను ఆహ్వానించామన్నారు. మాజీ జడ్పీటీసీ రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 2.450 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగా, ఇప్పటి వరకు మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగా ఇప్పటి వరకు 443.975 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 2 యూనిట్లను ప్రారంభించి 2.836 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 431.249 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు ఆయన తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తిని చేపట్టే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

రాష్ట్ర షూటింగ్‌బాల్ టీమ్ కెప్టెన్‌గా మహేశ్వరి



గద్వాల అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండల పరిధిలోని నందిన్నె జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న మహేశ్వరి తెలంగాణ రాష్ట్ర షూటింగ్‌బాల్ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపికైందని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, డీవైఎస్‌వో కృష్ణయ్య, సెక్రటరీ మంజునాథ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ తరపున జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడం ఎంతో అబినందనీయమన్నారు. అందులో మహేశ్వరి కెప్టెన్‌గా వ్యవహరించడం జిల్లాకే గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి నందిన్నె జడ్పీహెచ్ఎస్, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్, పీఈటీ అమ్రేస్ బాబు, అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

తుంగభద్రలో 14 కిలోల చేప

మానవపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మానవపాడు మండలం మద్దూరు గ్రామ శివారులోని తుంగభద్ర తీరంలో మంగళవారం మత్స్యకారుడు చేపల కృష్ణ వలకు భారీ చేప చిక్కింది. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి 14 కిలోల చేప (బొచ్చ) చిక్కడం ఇదే మొదటి సారి కావడంతో మత్స్యకారుడు ఆనదం వ్యక్తం చేశారు. ఈ చేపను మానవ పాడుకు తీసుకువచ్చి రూ. 200 కిలో చెప్పున అమ్మకాలు చేశారు.



14 కిలోల చేపతో కృష్ణ

ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్, ఫార్మ్-డి, బి.పి.ఎడ్

ఫలితాలు విడుదల



ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్, ఫార్మ్-డి, బి.పి.ఎడ్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్ ఏడవ సెమిస్టర్, ఫార్మ్-డి రెండు, మూడు, నాలుగు, ఐదవ సెమిస్టర్, బి.పి.ఎడ్ నాల్గవ సెమిస్టర్ విద్యార్థుల పరీక్షల ఫలితాలను మంగళవారం పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్ ఏడవ సెమిస్టర్‌లో 85శాతం, ఫార్మ్-డి రెండు, మూడవ, నాలుగు, ఐదవ సెమిస్టర్‌లలో 78శాతం, బి.పి.ఎడ్ నాల్గవ సెమిస్టర్‌లో 82శాతీం ఉత్తీర్ణత సాధించారని, ఫలితాలను తెలుసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ తెలిపారు. అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శాంతిప్రియ, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ భూసేకరణ అక్రమాలు బయటపెడతాం

» జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సేకరించిన భూముల పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలను బయటపెడతామని, బాధ్యులైన ప్రతీ ఒక్కరిపై చర్యలు తీసుకునేలా చూస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూములు లేకున్నా గైరాన్, భూదాన్ భూములపై పరిహారాలు దిగమింగిన వారందరినీ బయటికి లాగుతామని పేర్కొన్నారు. పోలేపల్లి శివారులోని సర్వే నెంబరు 554లో భూములు లేకున్నా ఎకరానికి రూ.12 లక్షల చొప్పున అక్రమంగా పరిహారాలు పొందారని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారని తెలిపారు.

అందులో 23 మంది వ్యక్తులు రూ.3 కోట్ల 84లక్షలు పరిహారంను దండుకున్నారని తేలిందని, వీరందరికి నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. వీరితో పాటు అప్పటి తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ సుదర్శన్ రెడ్డిలకు సైతం షోకాజ్ నోటీసులు అందినట్లుగా తెలిసిందని పేర్కొన్నారు. ఉదండాపూర్ భూసేకరణలో అధికారులు, బీఆర్ఎస్ నాయకుల అక్రమాల కారణంగా నష్టపోయిన బాధితులు ఎవరైనా, జడ్చర్లలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో సమాచారం అందించాలని కోరారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


ఆనంద్ (ఫైల్)

మానవపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల కేంద్రానికి చెందిన అందిరి చెట్టు ఆనంద్(26) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాలలా ఉన్నాయి.. ఆనంద్ మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మానసిక వేదనకు గురైన అతడు జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి 7 గంటల సమయంలో కర్నూల్ నుంచి కాచిగూడకు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గద్వాల ఆసుపత్రికి తరిలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. అతడి తండ్రి కన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి కన్నుమూత


వీరేశ్ (ఫైల్)

అయిజ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణానికి చెందిన ప్రవేటు పాఠశాల డ్రైవర్ మాల వీరేశ్ (28) సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, నాగర్‌దొడ్డి, బింగిదొడ్డి స్టేజీల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన అతడిని కర్నూల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

బాణసంచా దుకాణంలో మంటలు

కోస్గి/కోస్గి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ రోజు నారాయణపేట జిల్లాలోని కోస్గిలోని ఓ బాణసంచా దుకాణంలో మంటలు చెలరేగాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. సోమవారం రాత్రి పట్టణంలోని నాగులబావి సమీపంలో గల వినయ్‌కుమార్ బాణసంచా దుకాణంలో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల వారు ఒక్కసారిగా పరుగులు తీశారు. చుట్టుపక్కల దుకాణాల యజమానులు అప్రమత్తమై నీరు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

రెండు లారీలు ఢీకొని ఒకరి మృతి

రాజాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొని, ఒకరు మృతి చెందారు. రాజాపూర్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని సోమవారం తెల్లవారుజామున రాజాపూర్ సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద దుందుభీ వాగు నుంచి ఇసుకలోడ్‌తో వస్తున్న మరో లారీ ఢీకొన్నది. ప్రమాదంలో తమిళనాడు లారీ డ్రైవర్ ధర్మపురి జిల్లా, తిమ్మపీలేరుకు చెందిన గోవిందం (43) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని బాదేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వారు మంగళవారం ఉదయం ఆసుపత్రికి చేరుకున్నారు. సంఘటనపై గోవిందం కుమారుడు గౌషిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విహారానికి వచ్చి మృత్యువాత


కుమ్మరి శేఖర్ (ఫైల్)

కోయిలకొండ, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులతో కలిసి విహరించేందుకు వచ్చిన ఓ వ్యక్తి వాగులో పడి మృతి చెందాడు. కోయిలకొండ మండలంలోని అంకిళ్ల వాగులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సింహగిరి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కుమ్మరి శేఖర్ (50) భార్య, కుమార్తెలతో పాటు పక్కింటి వ్యక్తి ఆశిష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి అంకిళ్ల వాగును చూసేందుకు వచ్చారు. అందరూ సరదాగా గడుపుతుండగా, శేఖర్ స్నానం చేసేందుకు సిద్ధమయ్యాడు. వాగు అంచునే ఉన్న బండపై పాకర ఉండటంతో జారి నీటిలో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండటంతో అందరూ చూస్తుండగానే మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వాగులో గాలించి అతడిని బయటకు తీయగా, అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సంఘటనపై భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బల్మూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలంలోని మహాదేవ్‌పూర్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిన్‌కుంట గ్రామానికి చెందిన సైదులు(29), మంజుల దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. వారు కొంతకాలంగా అత్తగారి ఊరైన అచ్చంపేట మండలంలోని పల్కపల్లిలో నివసిస్తున్నారు. మూడు రోజుల క్రితం సైదులు భార్యతో గొడవపడ్డాడు. తాను జిన్‌కుంటకు పోతున్నట్లు చెప్పి ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో మహాదేవ్‌పూర్ సమీపంలోని ఓ పొలంలో పడి ఉన్న అతడి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, చనిపోయినది సైదులుగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి భార్య మంజులను విచారించి, ఆమె ఫిర్యాదు మేరకు, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్తీక మాసం పరమ పవిత్రం



» నేటి నుంచి ప్రారంభం » ముస్తాబైన ప్రధాన ఆలయాలు » నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు


విద్యుత్ దీపాల వెలుగులో కొత్తకోట కోటిలింగేశ్వరస్వామి ఆలయం

నారాయణపేట/ అలంపూర్/ కొత్తకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వర్తిస్తుంది. అలా పూర్ణ చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి కార్తీక మాసమని పేరు. ఇది బుధవారం నుంచి ప్రారంభమై నెల రోజుల పాటు, అంటే నవంబరు 20 వరకు ఉంటుంది. ఈ మాసంలో సూర్యోదయం లోపు పుణ్య స్నానాలు ఆచరించడం, దీపారాధన, దీపదానం, గంగా స్నానం, వనభోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో నెల రోజుల పాటు విశేష పూజలు జరుగుతాయి. నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యాసాశ్రమం, అవదూత నర్సింహస్వామి మఠం, మక్తల్ పడమటి అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, గుడెబల్లూరు వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు, జిల్లా సమీపంలోని యానగుంది సూర్యనంది క్షేత్రం కార్తీక మాస పూజలను విశేషంగా నిర్వహిస్తారు. నారాయణపేట పట్టణంలోని శక్తిపీఠంలో నెల రోజుల పాటు ప్రతీ నిత్యం ప్రత్యేక పూజలతో పాటు రాత్రి 7 నుంచి 7.15 గంటల వరకు కార్తీక మహత్య పురాణం, 7.13 నుంచి 7.30 వరకు భగవన్నామ సంకీర్తనలు, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శక్తిపీఠం స్వామి శాంతానంద పురోహిత్ కోరారు. రాఘవేంద్ర స్వామి, అనంతసేన దేవాలయాల్లో కార్తీక మాస మహత్య పురాణ ప్రవచనం, కార్తీక దీపారాధన నిర్వహించనున్నారు.

నదీస్నానం పుణ్యప్రదం

కార్తీక మాసం ఆద్యంతం సూర్యోదయానికి ముందు నదీ స్నానం పుణ్య ప్రదమని భక్తుల విశ్వాసం. ప్రవహించే నీటిలో స్నానం చేస్తే శారీరక రుగ్మతలతో పాటు మానసిక రుగ్మతలు దూరమవుతాయని పెద్దలు చెప్తారు. అలాగే వన భోజనాల ప్రసక్తి పలు ధార్మిక గ్రంథాల్లో ఉంది. కార్తీక పౌర్ణమి నాడు నైమిషారణ్యంలో మునులందరూ సూత మహర్షి ఆధ్వర్యంలో వన భోజనాలు చేసినట్లు కార్తీకపురాణంలో లిఖితమై ఉంది. ఉసిరి చెట్టుకింద కార్తీక దామోదరుడిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీహరి ప్రతిమను ప్రతిష్ఠించి, ఉసిరికలతో పూజించి, ఆ తర్వాత భోజనాలు చేశారని ప్రతీతి. శక్తిపీఠం అధ్వర్యంలో నవంబరు రెండున కృష్ణ, భీమా నదుల సంగమ క్షేత్రంలో శ్రీనివాస కల్యాణం, వనభోజనోత్సవం నిర్వహించనున్నారు.

5 ఒత్తులతో దీపారాధన

కార్తీక మాసంలో ఐదు ఒత్తులతో దీపారాధన చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిని గృహిణులు తెల్లవారుజామునే వెలిగించాలి. ఈ 5 ఒత్తుల్లో మొదటిది భర్త సంక్షేమం, రెండవది సంతానం, సంక్షేమం, మూడవది అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్ళ రక్షణ, నాలుగవది గౌరవం, ధర్మాభివృద్ధి, ఐదవ ఒత్తి వంశాభివృద్ధికి అని నారాయణపేటకు చెందిన కృష్ణ యజుర్వేద పండితుడు విభావసు పురోహిత్ తెలిపారు.


నారాయణపేట శివాలయంలో భక్తులు వెలిగించిన దీపాలు

అలంపూర్ ఆలయాల్లో విశేషపూజలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బుధవారం నుండి నవంబర్ 20 వరకు అలంపూర్ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దీప్తిరెడ్డి తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8.30 వరకు పూజలు చేయనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 2న తులసివన పూజ, 5న నదీ హారతి, 9న ఆరుద్రోత్సవం, 18న జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వారి కల్యాణం వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయాల్లో ఉదయం 11 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రముఖులకు (వీఐపీ) బ్రేక్ దర్శనం ఉంటుందని చెప్పారు.

ముస్తాబైన శివాలయాలు

వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు కార్తీక మాసోత్సవాలకు ముస్తాబయ్యాయి. కానాయపల్లిలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం కోటిలింగేశ్వస్వామి, పామాపురం శివారులో, ఊకచెట్టి వాగు పరివాహక ప్రాంతంలో భ్రమరాంబా సమేత రామేశ్వరాలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్తీక మాసాంతం వరకు తెల్లవారుజామునే ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తారు. అందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. .

కానిస్టేబుల్ రాకేశ్ కేసులో మరో వ్యక్తి రిమాండ్

» వెల్లడించిన వనపర్తి సీఐ కృష్ణ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

వనపర్తి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ బండారు రాకేశ్ కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను వనపర్తి పట్టణంలోని సీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణ వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, మదనాపూర్ మండలం గోవిందహళ్లి గ్రామానికి చెందిన మోహన్ అనే కానిస్టేబుల్ 2023లో ఇల్లు కొనుగోలు చేయాలనుకున్నాడు. విషయం తెలిసిన మరో కానిస్టేబుల్ బండారు రాకేశ్ అతడిని సంప్రదించాడు. మలిశెట్టి శివశంకర్ అనే వ్యక్తి పేరు మీద తాను కట్టిన ఇల్లు వనపర్తి మునిసిపాలిటీ పరిధిలో 250 చదరపు గజాల విస్తీర్ణంలో ఉందని తెలిపాడు. దాని ధర రూ. 43 లక్షలని చెప్పాడు. అతడి మాటలను నమ్మిన మోహన్ రూ. 2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చి విక్రయ ఒప్పందంపై సంతకం చేశాడు. కానీ రాకేశ్ ఆ ప్లాట్‌ను అంతకుముందే రూ. 36.50 లక్షలకు వనపర్తి కెనరా బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. తాను చేసిన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు నకిలీ ఈసీని సృష్టించి, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సంతకాలు చేయించాడు. ఆ నకిలీ పత్రాలను మోహన్‌కు ఇచ్చాడు. అతడితో పోలీస్ భద్రత లోన్ కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో దరఖాస్తు చేయించాడు. దీంతో 2024, జూలై 5న మోహన్‌కు 39.40 లక్షల రూపాయల రుణం మంజూరయ్యింది. ఆ మొత్తం శివశంకర్ యొక్క ఐటీబీ ఖాతాలో జమ యింది. ఆ తర్వాత ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని అడిగితే, రాకేశ్, శివశంకర్‌లు సాకులు చెప్తూ తప్పించుకుని తిరుగుతున్నారు. మోహన్‌కు అనుమానం వచ్చి ఈసీ తీసుకొని చూడగా, ఆ ప్లాట్‌ను గతంలోనే బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు తెలిసింది. ఈ విషయంపై వారిని నిలదీయగా, రాకేశ్ రూ.20 లక్షలు చెల్లించాడు. మిగతా మొత్తం చెల్లించక పోవడమే కాకుండా మోహన్‌ను బెదిరించాడు. దీంతో అతడు గత నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు రాకేశ్‌ను ఇటీవల కస్టడీలోకి తీసుకొని విచారించగా, నేరం అంగీకరించాడు. దీంతో శివశంకర్, రాకశ్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో టౌన్ ఎస్‌ఐ శశిధర్ పాల్గొన్నారు.

పండుగ వేళ పాముల కలకలం

» ఎర్గట్‌పల్లి ఆలయంలో ఘటన
» ఆందోళనకు గురైన భక్తులు

ఊట్కూర్/ వనపర్తి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ వేళ రెండు గ్రామాల్లో పాములు కలకలం సృష్టించాయి. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని ఎర్గట్‌పల్లి సమీపంలోని గుట్టపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు నాగుపాము కనిపించింది. దీపావళి అమావాస్య సందర్భంగా మంగళవారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లిన భక్తులకు విగ్రహం వెనుక నాగుపాము కనిపించింది. దీంతో భయపడిన వారు బయటకు పరుగు తీశారు. ఆ తర్వాత కొందరు కర్రతో పామును బెదిరించి బయటకు పంపించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పూజలు చేయకుండానే భక్తులు వెనుదిరిగి వెళ్లిపోయారు. మళ్లీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత భక్తులు ఆలయానికి చేరుకోగా పాము కనిపించ లేదు. పురోహితుడు వెంకటనారాయణ స్వామివారికి పూజలు చేశారు.


ఎర్గట్‌పల్లి ఆలయంలో కనిపించిన నాగుపాము

ఇంట్లోకి వచ్చిన నాగుపాము

వనపర్తి మండలం, చిట్యాల గ్రామంలోని ఓ ఇంట్లో సోమవారం నాగుపాము దూరింది. గ్రామానికి చెందిన సంఘం బోర్‌వెల్ యజమాని నాగరాజు దీపావళి పండుగను పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు స్వీట్లు, ఇతర పిండి వంటలు తయారుచేస్తుండగా అక్కడే ఉన్న మెట్ల కింద నాగుపాము పడగ ఎత్తి బుసలు కొట్టింది. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురై ఇంట్లోకి పరుగుతీశారు. అనంతరం స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సాగర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పామును బంధించి తీసుకెళ్లాడు. దాన్ని అడవిలో వదిలివేయనున్నట్లు తెలిపారు.


చిట్యాల గ్రామంలోని ఓ ఇంట్లో పడగ విప్పి బుసలు కొడుతున్న నాగుపాము

భక్తిశ్రద్ధలతో చండీహోమం


చండీహోమం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

అలంపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో దీపావళి అమావాస్య సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో సామూహిక చండీహోమం నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీపావళి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

హెచ్‌సీఏ 2డే లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ గెలుపు

» 8 వికెట్ల తేడాతో నిజాం కాలేజీపై విజయం



విజయసంకేతం చూపిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు క్రీడాకారులు, 8 వికెట్లు తీసిన బౌలర్ ముఖీద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) బి-డివిజన్ 2డేలీగ్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 8 వికెట్ల తేడాతో నిజాం కాలేజ్‌పై విజయం సాధించింది. హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ గ్రీన్ వివ్- 3 మైదానంలో మంగళవారం నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నిజాం కాలేజీ జట్టు 31.5 ఓవర్లలో 55 పరుగులకు కుప్పకూలింది. జిల్లా బౌలర్ ముఖీద్ అద్భుతంగా బౌలింగ్ చేసి 8 వికెట్లు తీసి రాణించాడు. కె. శ్రీకాంత్, శాశంక్ చేరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులో కే. శ్రీకాంత్ 23, అబ్దుల్‌రాఫె 23 పరుగులు చేశారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన ముఖీద్‌ను క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు.

'చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

అమరచింత ,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, పరిశ్రమ యజమానులు పరిష్కరించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే రాజన్న డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా, అమరచింత మండల పరిధిలోని సింగంపేట, మస్తీపూర్, చంద్రగౌడ్, నందిమల్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. చెరుకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, యజమాన్యం ప్రకటించిన సబ్సిడీలు సాధించుకోవాలని కోరారు. పండించిన చెరుకు పరిశ్రమకు చేరిన వెంటనే, రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో నిర్వహించనున్న జనరల్ బాడీ సమావేశానికి చెరుకు రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రాజన్న, నల్లారెడ్డి, రవి సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, బాలచంద్రారెడ్డి, రాజేందర్, నల్లారెడ్డి, కృష్ణ, శివారెడ్డి, మోహన్, రాములు పాల్గొన్నారు.

కురుమూర్తి రాయుడికి కోటి దండాలు

» నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం » 26న అలంకారోత్సవం, 28న ఉద్దాలోత్సవం » ఏర్పాట్లపై నేడు సమీక్షా సమావేశం


స్వామికి సమర్పించేందుకు నైవేద్యాన్ని సిద్ధం చేస్తున్న భక్తులు

చిన్నచింతకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దాదాపు 45 రోజుల పాటు జాతర కొనసాగనున్నది. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు మయూర, హంస, శేష, అశ్వ, హనుమత్, గరుడ, గజ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు దాసంగాలను సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఉత్సవాలు, జాతర ఏర్పాట్లపై బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మదుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. దీనికి కలెక్టర్ విజయేందిరబోయిలతో పాటు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

ఉత్సవాలు కొనసాగేది ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22న ఉదయం ఆవాహిత దేవతాపూజలు, . ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూజ, అష్టోత్తర శతకలశాభిషేకం, కల్యాణోత్సవం, మయూర, హంస వాహన సేవలు నిర్వహిస్తారు. 23న నిత్య విశేష పూజలతో పాటు హంసవాహనసేవ, 24న శేష వాహనసేవ. 25న గజవాహనసేవ ఉంటాయి. 26న ఆత్మకూర్ ఎస్‌బీఐ నుంచి క్షేత్రం వరకు ఆభరణాల ఊరేగింపు ఉంటుంది. అదే రోజు రాత్రి స్వామి వారికి అలంకారోత్సవం నిర్వహిస్తారు. 27న హనుమత్‌సేవ, 28న ఉద్దాలోత్సవం, రాత్రికి గరుడ వాహన సేవ ఉంటాయి. 29న పుష్పయాగం, మంగళ నీరాజనం, 30న మంగళ నీరాజనంతో కార్యక్రమం పరిసమాప్తి కానున్నది.


కురుమూర్తి ఆలయ గాలిగోపురం

పకడ్బందీ ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు లక్షలాదిగా తరలి రానున్న భక్తుల కోసం అవసరమైన ఆలయ పాలకవర్గం, అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అడుగడుగునా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పోలీసు ఔట్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నారు.

జాతరమైదానంలో 3 ఆర్టీసీ బస్సు స్టాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా గుట్టమీద క్యూలైన్లు, బారి కేడ్లను సిద్ధం చేశారు. కోనేరు వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచనున్నారు. జాతర ప్రాంగణంతో పాటు, సమీప ప్రాంతాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయనున్నారు. అందుకోసం ఎక్సైజ్ పోలీసులు ప్రధాన కూడళ్ళ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేశారు.

అప్పుల బాధ తాళలేక...

కురుమూర్తి క్షేత్ర విశిష్ఠతపై ఆసక్తికర కథనం ఉంది. కుబేరుడి అప్పుల బాధ భరించలేక స్వామి వారు లక్ష్మీదేవితో కలిసి ఉత్తర ముఖంగా కురుమూర్తి వైపు వస్తున్నారు. కురుమూర్తి కొండల నుంచి చల్లటి, సువాసనా భరిత గాలులు రావడాన్ని గమనించిన లక్ష్మీదేవి కాసేపు విశ్రమిద్దామని స్వామిని కోరింది. అందుకు స్వామి వారు సమ్మతించారు. దేవరగట్టులోని కాంచనగుహలో స్వామి, అక్కడికి సమీపంలోని కొండపై అమ్మవారు కొలువుదీరారు. అప్పటి నుంచి భక్తులు స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్నారు. ఆనాటి ముక్కెర వంశ రాజులు ఆలయ అభివృద్ధికి సహాయ సహకారలు అందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ క్షేత్రం తిరుమల తిరుపతికి, కురుమూర్తి క్షేత్రానికి పలు పోలికలు కనిపిస్తాయి. అక్కడ ఉన్నట్లుగానే ఇక్కడా ఏడు కొండలున్నాయి. మోకాళ్ల పర్వతం కూడా ఉంది. స్వామి వారి రాజగోపురం సమీపంలో మెట్ల దారిలో స్వామి వారి పాదాలు భక్తులకు దర్శనమిస్తాయి. గుట్టపైన లక్ష్మీదేవి అమ్మవారు ఉన్నారు. సమీపంలోనే చెన్నకేశవస్వామి వారి ఆలయం ఉంది.

ఇంటర్వ్యూ..

మహిళా సంఘాల సభ్యులు నిలదొక్కుకోవాలి

● నరహరి, ఏపీఎం, ధరూర్



ధరూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్న సబ్సిడీ, వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం నరహరి అన్నారు. రుణాల మంజూరు విషయమై 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

మండలంలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి?

మండలంలో 28గ్రామ పంచాయతీల్లో 683 మహిళా సంఘాలు ఉన్నాయి.

ఇప్పటి వరకు ఎంత రుణం మంజూరైంది?

మండలానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.20,91,000 మంజూరయ్యాయి.

సబ్సిడీ వాహనాలు అందించారా?

రేవులపల్లి, బూరెడ్డిపల్లి, మార్లబీడు గ్రామాల్లోని సంఘాల సభ్యులకు సబ్సిడీ కింద రెండు వాహనాలు మంజూరయ్యాయి. రేవులపల్లి, బూరెడ్డిపల్లి గ్రామాలకు రెండు చేపల వ్యాన్లను ఇప్పటికే అందించాము.

వడ్డీలేని రుణాలు ఎన్ని సంఘాలకు అందాయి?

మండలంలో వడ్డీ లేని రుణాలు 470 సంఘాలకు రూ.49,41,000 అందజేశారు.

కిశోర బాలికల సంఘాలు ఎన్ని ఉన్నాయి?

మండలంలో 15 సంఘాలు ఉన్నాయి. సమావేశాలు నిర్వహిస్తున్నాము. ప్రధాన మంత్రి స్కీంలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. త్వరలోనే మరో పది సంఘాలు ఏర్పాటు కానున్నాయి.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు గురుకుల మెటీరియల్ పంపిణీ

ఉండవల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన శ్రీరామ్‌సింగ్ ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి విద్యార్థులకు మంగళవారం గురుకుల మెటీరియన్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

వడ్డేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత పథకంలో భాగంగా మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయంలో 50శాతం సబ్సిడీపై జొన్నలు, రాగుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి రాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాలఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 33/11 కేవీ వీరాపురం సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే, 11కేవీ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా ఈ నెల 22న బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 132/33 కేవీ గద్వాల్ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 33కేవీ ఆయిల్‌సీడ్ ఫీడర్ పరిధిలోనూ 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పూడూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పూడూరు, కొండపల్లి, జంగంపల్లి, రేవల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

యువకుల శ్రమదానం

ఇటిక్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం శ్రమదానం చేసి తొలగించారు. ముళ్లపొదల వల్ల పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నా, మురుగు రోడ్లపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.

'వక్ఫ్ భూములను కాపాడాలి'

రాజోలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజోలిలోని వక్ఫ్ బోర్డు భూములు సర్వే నెం. 581 పైకిలో ఎ- 2.23 గుం.ను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని మంగళవారం రాజోలి తహసీల్దార్ రామ్మోహన్‌కు, పోలీస్ స్టేషన్‌లో గ్రామంలోని ముస్లింలు వినతిపత్రం అందజేశారు.

డీవైఎస్‌వోకు ఘన సన్మానం

గద్వాలఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టిన ఫిజికల్ డైరెక్టర్ కృష్ణయ్యను సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామ్మోహన్, ఆర్.మోహన్, సంకర ప్రభాకర్, జూనియర్ లెక్చరర్ పరేష్‌బాబు, గంజిపేట వంశీ, రుద్రగౌడ్, రామిరెడ్డి, నరసింహులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలి

● కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ప్రతాప్‌రెడ్డి

ధరూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలను సులభ పద్ధతిలో ప్రతీ విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలని కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం చిన్నపాడు ఎంపీయూపీఎస్‌ను హెచ్‌ఎం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. హెచ్‌ఎం వెంట సీఆర్పీ నర్సింలు ఉన్నారు.

వనమహోత్సవం మొక్కలపై నిర్లక్ష్యం

● ఎండలో ఎండిపోతున్న మొక్కలు

● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గుడ్డెందొడ్డిలో ఎండిపోయిన మొక్కలు

ధరూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని 28 గ్రామ పంచాయతీలకు పది వన నర్సరీలు ఉన్నాయి. వనమహోత్సవం మొక్కలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి వాటిని పెంచేందుకు కృషి చేస్తున్నప్పటికీ వాటి ఆచరణలో కిందిస్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మొక్కలను సాంద్రమైన ఎరువులతో పాటు మట్టి నమూనాలను సేకరించి నర్సరీల్లో మొక్కలు పెంచాలి. కానీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రతీ గ్రామంలోనూ మొక్కలు వాడుపడుతున్నాయి. కాగా గుడ్డెందొడ్డిలో పక్కనే నీరు ఉన్నా వాటి సంరక్షణ బాధ్యతను అధికారులు మరవడంతో వనమహోత్సవం మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. నాటిన మొక్కలకు సైతం సక్రమంగా నీరు అందించకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. అల్వాపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం కారణంగా మొక్కలు ఎండిపోవడంతో వాటిని చెరువు పక్కన పారబోసిన సంఘట నలు ఉన్నాయి. ఇలా ప్రతీ గ్రామంలోనూ ఉపాధి హామీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతీ గ్రామంలోనూ మొక్కలు ఎండుముఖం పడుతున్నాయని ఆయాగ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వనమహోత్సవం మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రతీ గ్రామంలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు, వాటికి సంబంధించి నీరు పోయడం, కిందిస్థాయి సిబ్బందిపై ఉపాధి హామీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాము.

\- కృష్ణమూర్తి, ఎంపీడీవో

విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్

● గట్టు కస్తూర్బా పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

● వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచన



గట్టు కస్తూర్బాలో విద్యార్థులకు పాఠం బోధిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గట్టు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల కోసం ఇప్పటినుండే కష్టపడి శ్రద్ధగా చదువుకుని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ బీఎం. సంతోష్ కస్తూర్బా విద్యార్థినులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈసందర్భంగా కస్తూర్బా పాఠశాలలో తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. కాసేపు పాఠాలు బోధించారు. టెన్త్ విద్యార్థినులతో మానవ అభివృద్ధి సూచిక, స్థూల జాతీయోత్పత్తి, రాజ్యాంగ ప్రస్తావన, పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాలు ఆదాయం సమానత్వం వంటి సాంఘిక శాస్త్రంలోని ముఖ్యమైన అంశాలను వివరించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు, కంప్యూటర్ ల్యాబ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో చెన్నయ్య ఉన్నారు.

● **అందరికీ వైద్యసేవలు అందించాలి**

ప్రభుత్వ అనుపత్రికి వచ్చే ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సంతోష్ వైద్యులను ఆదేశించారు. ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను, సౌకర్యాలను పరిశీలించారు. సహజ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సూర్యప్రకాష్, వైద్యసిబ్బంది ఉన్నారు.

● **ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలూరు గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూ భారతి దరఖాస్తులపై ఆరా తీశారు. నిషేధిత భూములు, ఇతర ప్రత్యేక భూముల అక్రమ రిజిస్ట్రేషన్ జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో చెన్నయ్య ఉన్నారు.

తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేలో పాల్గొనాలి

● 25న ముగియనున్న సర్వే

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారని కలెక్టర్ బీఎం సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈ నెల 25న ముగుస్తుందన్నారు. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి అందుబాటులో ఉన్నందున వెబ్‌సైట్‌లో ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వాల అశ్రద్ధ



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయిజలో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వాలు అశ్రద్ధ చేస్తున్నాయంటూ బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం అయిజలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం అందుబాటులో ఉందని తెలిపారు. అయిజ పరిసర మండలాలలోను డిగ్రీ కళాశాలల ఏర్పాటు జరిగినప్పటికీ అయిజలో ఏర్పాటుపై రాజకీయ నాయకులు అశ్రద్ధ చేస్తున్నారంటూ మండిపడ్డారు. అటు బీఆర్‌ఎస్ కాని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ కళాశాల ఏర్పాటు విషంలో ముందుకు రావటం లేదన్నారు. కళాశాల అందుబాటులో లేని కారణంగా ప్రతీ సంవత్సరం వేలాది మంది గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఇచ్చి డిగ్రీ కళాశాల ఏర్పాటు అమలుకు నోచుకోలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ప్రచారానికి వచ్చిన ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి సైతం అయిజలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికార పార్టీల నాయకులు హామీలు ఇస్తున్నారే కానీ అమలు చేయటం లేదని తెలిపారు. వీలైనంత త్వరగా కళాశాల ఏర్పాటు చేయకపోతే ఉద్యమించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, మేడికొండ భీమ్‌సేన్‌రావు, లక్ష్మణ్‌గౌడు, నాగరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కేటాయింపుకు దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈనెల23 వరకు పొడిగించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం షాపుల కేటాయింపు ఈనెల 23న జిల్లా కలెక్టర్ సమక్షంలో జరగాల్సి ఉండగా అనివార్యకారణాల వల్ల డ్రాను 27వ తేదీకి పొడిగించినట్లు తెలిపారు. కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అలంపూరు మునిసిపాలిటీకి రూ.15 కోట్లు

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అలంపూరు మునిసిపాలిటీ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.15కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. ఈ నిధులను పట్టణంలోని అన్నివార్డుల పనులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 1 నుంచి 10వార్డులలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీల నిర్మాణాలు, తాగునీటి పైపులైను నిర్మాణాలు, వరద నీటి కాలువ విస్తరణ పనులు, అక్బర్‌పేట కాలనీలో కోటగోడ వద్ద అప్రోచ్ కల్వర్టు నిర్మాణం, ప్రధాన కూడళ్లలో అభివృద్ధి పనులతో పాటు మునిసిపాలిటీ సుందరీకరణ పనులు చేసేందుకు పరిపాలన అనుమతులు వచ్చినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

● జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అలంపూర్ శ్రీనివాస్

గద్వాలఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అయిజ పట్టణానికి చెందిన మాల వీరేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అలంపూర్ శ్రీనివాస్, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వీరేష్ మృతదేహాన్ని పార్టీ నాయకులు సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తక్షణమే స్పందించి మృతుడి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు. పరామర్శించిన వారిలో అయిజ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహులు, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు అయిజ మల్లికార్జున్, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, నాయకులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తాం

కేటీదొడ్డి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడా కూడా విద్యుత్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం విద్యుత్ అధికారుల ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా కేటీదొడ్డిలో పర్యటించారు. గ్రామంలోని ప్రజలతో విద్యుత్ సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీరింగ్ శ్రీధర్, ఫోర్‌మెన్ భాస్కర్, ఎల్‌ఐ బాలస్వామి, ఎల్‌ఎం మునిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● హమాలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు దేవదాసు

ధరూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గద్వాల జిల్లా కేంద్రంలో ఈ నెల 22న జరిగే తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధ) మూడవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ధరూరు మండల హమాలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు దేవదాసు అన్నారు. పట్టణంలోని నల్లకుంట వాల్మీకికమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే సభలకు హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. మంగళవారం ధరూర్ మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు, కార్మికులతో కలిసి జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా దేవదాసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల అభివృద్ధికి కార్మికులు అన్నిరకాల సహకారం అందిస్తున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. హమాలీలకు పెన్షన్ సౌకర్యం, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభలకు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు హాజరవుతున్నారని, మండలంలో ఉన్న రైస్ మిల్, గ్రామీణ కూలీలందరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో నరసింహులు, రాముడు, ముఖన్న, తిమ్మన్న, ఆంజనేయులు, గోవిందు, అంజి, లాజర్, సీతారం, డ్రైవర్ పాంటన్న, ఉన్నారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

● మండల వ్యవసాయాధికారి జనార్దన్

అయిజ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ కింద రైతులకు అందజేయాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జనార్దన్ తెలిపారు. యాసంగికి కాను సబ్సిడీ కింద మినుములు విబిఎన్ 8 రకం 4కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ. 580 కాగా సబ్సిడీ రూ.200 పోను రూ.380కి రైతులు కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. 250 ప్యాకెట్లు అనగా 10 క్వింటాళ్ల నిలువలు ఉన్నట్లు తెలిపారు. జొన్న సీఎస్‌వి 15 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ. 200కాగా సబ్సిడీ రూ.60పోను రూ.140 చెల్లించాలని తెలిపారు. 5 క్వింటాళ్ళ నిల్వలు ఉన్నట్లు తెలిపారు. అలాగే జొన్న సీఎస్వీ 41 రకం 2 క్వింటాళ్ళు, పప్పు శనగ ఎంబీఏజీ 47 రకం 30 క్వింటాళ్ళ నిల్వలు ఉన్నాయని తెలిపారు.

జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

● నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనాల పరిశీలన

గద్వాల,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మెడికల్ కళాశాల పక్కన నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో హైదరాబాద్, కర్నూల్, రాయిచూర్ వంటి ప్రాంతాలకు అత్యవసర వైద్యం కోసం వెళ్లకుండా గద్వాల జిల్లాలోనే 300 పడకల ఆసుపత్రి, మెడికల్ కళాశాల నర్సింగ్ కళాశాల, అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెస్తున్నట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనాలు, మెడికల్ కేర్ నిర్మాణం కోసం రూ.48కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులు వచ్చే చివరివారంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిచే ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. ఆసుపత్రిలో అన్నిరకాల వైద్య సదుపాయాలు, అందుబాటులో ఉంచుతామన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్లు మురళీ, నరహరి శ్రీనివాసులు, పూడూరు కృష్ణ, నరహరిగౌడ్, నాగులు యాదవ్, కురుమన్న, గోవిందు, నాగేంద్రయాదవ్ ఉన్నారు.

● **ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం**

గద్వాల న్యూటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో ఎంబీబీఎస్ విద్యార్థి హరిజన నవీన్‌కుమార్‌కు అమరవాయి మాజీ ఎంపీటీసీ పెద్దగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే చేతులమీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాలుగేళ్ల క్రితం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు రాగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి భరోసా కల్పించి వైద్యవిద్య పూర్తయ్యే వరకు ఆర్థికంగా పూర్తిసహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు ఎమ్మెల్యే, పెద్ద గోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రాజు, బొజ్జన్న, రవి, మహేశ్ ఉన్నారు.

● **రైతు కుటుంబానికి పరామర్శ**

ధరూరు : మండలంలోని జీరబండ గ్రామానికి చెందిన రైతు గోవిందు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రైతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకోవాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు. ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రఘుకుమార్ శెట్టి, నాయకులు కృష్ణారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు అయోడిన్ ఉప్పు వాడాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాలన్యూటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అందరూ అయోడిన్ ఉన్న ఉప్పును వాడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. గ్లోబల్ డిఫిషియన్సీ అయోడిన్ డిజార్డర్స్ ప్రివెన్షన్ డే సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యను గ్రామాల్లో అందరికి వివరించాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యాకిరణ్మయి, డాక్టర్లు ప్రసూనారాణి, రాజు, రిజ్వానా తన్వీర్, డీపీహెచ్‌ఎన్‌వో వరలక్ష్మి, ఎన్సీడీ జిల్లా కోఆర్డినేటర్ శ్యాంసుందర్, డీడీఎం రామాంజనేయులు ఉన్నారు.

వ్యక్తులపై కేసు నమోదు

వడ్డేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలం తగాదా విషయంలో గొడవపడటం వల్ల మండలంలోని కొంకల గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్, జగదీశ్‌పై కేసు నమోదు చేసినట్లు శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. అలాగే తనగల గ్రామానికి చెందిన కురువ కిష్టన్న, నరసింహులుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని హోటల్ వద్ద జైపాల్ అనే వ్యక్తిని కులం పేరుతో దూషించి, దాడి చేయడంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

గద్వాలలో చోరీ

గద్వాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గద్వాలలోని షేరెల్లివీధిలో చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. బాధితులు అహ్మద్ తెలిపిన వివరాలు.. అహ్మద్ మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలకు వెళ్లారు. మంగళవారం తిరిగిరాగా ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు, టీవీ, సిలిండర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ధరూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీరబండ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడి తన వ్యవసాయ పొలం వద్ద గుడిసెలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎస్‌ఐ కొండా శ్రీహరి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోవిందు(28) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఇంటి నుంచి పొలానికి వెళ్లి ఉరి వేసుకునే ముందు తన తమ్ముడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు అక్కడి వెళ్లే సరికే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

గద్వాల సర్కిల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్లను నియమించి ఇబ్బందులను తొలగించాలని కోరుతూ మంగళవారం బీఆర్‌ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డీఈవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు

గద్వాల సర్కిల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గద్వాలలో సోమవారం సంఘ్ ఆధ్వర్యంలో శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కాషాయం జెండాను ఎగుర వేసి సెల్యూట్ చేసి సంఘ్ ప్రార్థనను ఆలపించారు. అనంతరం అక్కడి నుంచి సుమారు వెయ్యి మందికి పైగానే భారీ ర్యాలీ (కవాతు) నిర్వహించారు.

పులికల్- మంత్రాలయం రహదారికి మరమ్మతులు



రహదారికి మట్టివేస్తున్న పులికల్ యువకులు

అయిజ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత 8 సంవత్సరాలుగా నిర్మాణం పూర్తి కాక ప్రయాణికుల ప్రాణాలతో జలగాటం ఆడుతున్న మంత్రాలయ రహదారికి మోక్షం లభించింది. పులికల్ గ్రామానికి చెందిన యువత ముందుకు వచ్చి మట్టి వేయించి మరమ్మతులు చేయించారు. అయిజ మీదుగా మేడికొండ, పులికల్, ఎమ్మిగనూర్, మంత్రాలయం వెళ్లే రహదారి గుంతలతో నరకప్రాయంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్వాకం కారణంగా 8 సంవత్సరాలుగా పూర్తికాకుండా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం కంకరతో పాటు గోతులు భయంకరంగా ఏర్పడ్డాయి. ఎవరు పట్టించుకోని కారణంగా పులికల్ గ్రామానికి చెందిన పులికల్ గ్రామ యువకులు, ట్రాక్టర్ యజమానులు మేమున్నామంటూ ముందుకు వచ్చారు. శ్రమదానంతో గోతులు పూడ్చారు. బారికి దేవన్న, బోయ భూపతి నాయుడు, లోకేష్, సప్లయ్‌నాగరాజు, శశివర్మతేజ, నర్సింహులు, వెంకటేష్, మహేష్, కృష్ణ రంగస్వామి తదితరులు శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

● లారీ హమాలీ కార్మికుల అడ్డాలో పోస్టర్ విడుదల

గద్వాలఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికులు మూడవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. మహాసభ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ బజార్ లారీ హమాలీ కార్మికుల అడ్డా వద్ద నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధ) మూడవ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలతో పాటు వస్తు, సేవలను అందించడంలో ఎగుమతి, దిగుమతుల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్న హమాలీ భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. జిల్లాలోని బజార్, ట్రాన్స్‌పోర్టు, సివిల్ సప్లయ్, దానా ఫ్యాక్టరీ, రైస్ మిల్స్‌తో పాటు గ్రామీణ ప్రాంత హమీలు కూడా పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పేరు నరసింహ, హమాలీలు విష్ణు, నరేష్, బాలు, తిరుపతన్న, నరసింహ, వెంకటరాజ, పవన్, రామాంజనేయులు ఉన్నారు.